PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

శుక్రవారం 16-10-2026 | పేజీలు : 8 | వెల రు : 2/- | సంపుటి : 2 సంచిక :136 | ప్రచురణ: సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

### పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- సింగిల్ విండో ద్వారా అనుమతులు..
- భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తాం
- పారిశ్రామికవేత్తలకు గార్డియన్‌గా ఉంటాను
- రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములుగా నిలవాలి
- సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భరోసా
- సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్--2026లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



"తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. మీ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది. పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో అనుమతులు, భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తాం. హైదరాబాద్ పెట్టుబడులకు అత్యంత సురక్షితమైన, అనుకూలమైన గమ్యస్థానం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలి" అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు తాను గార్డియన్‌గా వ్యవహరిస్తానని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. హైటెక్స్‌లో నిర్వహించిన సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్–2026లో ఆయన మాట్లాడుతూ, సంపద సృష్టికర్తలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.

## 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్..

### మహిళల భాగస్వామ్యం కీలకం: రాష్ట్రపతి ముర్ము



మిగతాది 2లో

పున్నమిఘాట్‌లో జాతీయ సరస్ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. విజయవాడకు రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని.. కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునే అవకాశం లభించిందన్నారు. దుర్గాదేవి ఉత్సవాల నేపథ్యంలో పున్నమిఘాట్‌లో ఏర్పాటు చేసిన సరస్ మేళాలో భాగంగా 'లఖ్‌పతి దీదీ' మేళాను నిర్వహించడం ఒక విశేషమైన కలయికగా భావిస్తున్నట్లు తెలిపారు.

## బెజవాడ దుర్గమ్మకు కానుకగా రూ.75 లక్షల విలువైన బంగారు కిరీటం



విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఈ వేడుకల్లో శ్రీకాకుళం పట్టణానికి చెందిన ఓ కుటుంబం అమ్మవారికి విశేష కానుకను సమర్పించింది. కూర్మినాయుడు, పద్మావతమ్మ దంపతుల కుమారుడు దుర్గా శ్రీనివాస్ రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటాన్ని ఆలయ ఈవో శీనానాయక్‌కు అందజేశారు. 494 గ్రాముల బంగారంతో ఈ కిరీటాన్ని రూపొందించారు.

## సింగరేణిని భ్రష్టు పట్టించింది బీఆర్ఎస్

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



దేశ రాజకీయాల్లో మార్పులు వస్తున్నాయని.. ఈ మార్పులే రాహుల్ గాంధీని ప్రధాని చేస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పైన మండిపడ్డారు సింగరేణిని రేవంత్ రెడ్డి ప్రైవేటీకరణ చేస్తారన్న కేటీఆర్ ఆరోపణలపై మంత్రి తీవ్రంగా స్పందించారు. సింగరేణిని భ్రష్టు పట్టించింది బీఆర్ఎస్ పార్టీనేనని.. తప్పులన్నీ వాళు చేసి, వాటిని తమపై రుద్దాలని ప్రయత్నిస్తున్నారని పొంగులేటి విమర్శించారు. సింగరేణిలో 18 గనులు మూతపడడానికి కారణమైన బీఆర్ఎస్.. ఇప్పుడు మొసలికన్నీరు పెట్టుకుంటోందని విమర్శించారు.

## సాంకేతికత వినియోగంలోనూ మెరుగ్గా ఉండేలా ఏర్పాట్లు:

### SEC అనిల్ చంద్ర పునేఠా

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇటీవల విడుదల చేసింది. ఈ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఏపీ ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.

2లో▸




## 'సింగరేణి'ని ప్రైవేటీకరణ చేయబోం.. చేయబోనివ్వం: మంత్రి శ్రీధర్‌బాబు

"సింగరేణి సంస్థకు బీఆర్ఎస్ ప్రభుత్వం బకాయిలు పెట్టింది. ఈ సంస్థను కేసీఆర్ కుటుంబసభ్యులు జేబు సంస్థగా మార్చుకున్నారు.

హైదరాబాద్: సింగరేణి సంస్థను దెబ్బతీసే విధంగా బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు ఆక్షేపించారు. ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సింగరేణిని కాపాడింది.. గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. గురువారం మంత్రి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో సింగరేణి కార్మికులు ఇబ్బంది పద్దారు.



## 'ఎల్‌నినో'పై అఖిలపక్ష సమావేశం.. తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం



హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావం తీవ్రమవుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్‌నినో పరిస్థితులపై అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. శుక్రవారం ఉదయం 11.30 గంటలకు సచివాలయంలో అఖిలపక్ష భేటీకి ఏర్పాట్లు చేసింది. దానికంటే ముందే..

## ఆంధ్రప్రదేశ్‌లో భారత్-అమెరికా తొలి దశ ట్రేడ్ డీల్ ఖరారు: పీయుష్ గోయల్



మిగతాది 2లో

## 'రూ.3 వేల కోట్ల విదేశీ బొగ్గు స్కామ్ ఆపాలి'..

- సీఎంకు కేటీఆర్ బహిరంగ లేఖ
- "విదేశీ బొగ్గు దిగుమతి ముసుగులో భారీ స్కామ్‌కు కుట్ర జరుగుతోంది.
- భోత్రా లాజిస్టిక్స్ అనే అనుమానాస్పద కంపెనీతో ముందే సీఎం చీకటి ఒప్పందం చేసుకున్నారు.



హైదరాబాద్: రూ.3 వేల కోట్ల విదేశీ బొగ్గు కుంభకోణం ఆపాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.కృత్రిమ బొగ్గు కొరత, కరెంటు సంక్షోభం సృష్టించి.. ఆ కంపెనీని రంగంలోకి దించారు. భోత్రా లాజిస్టిక్స్‌తో ప్రభుత్వం, సింగరేణి చేసుకున్న ఒప్పందాలను బయటపెట్టాలి.మొత్తం కుంభకోణంపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. ఇటువంటి వ్యవహారాలను అడ్డుకోవాల్సింది పోయి సహకరిస్తున్నారు.

# సంపాదకీయం

## జ్ఞానేశ్ కుమార్.. రోజురోజుకీ భారం!

హనుమంతుడు తొలుత అశోక వనాన్ని ధ్వంసం చేశాడు. తర్వాత కింకరుల్ని హతమార్చాడు. జంబుమాలీ, మంత్రి కుమారులు, సేనాధిపతులూ కుప్పకూలిపోయారు. రావణుడి కుమారుడు అక్షకుమారుడినీ బండకేసి కొట్టి చంపాడు. చివరకు ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రం ప్రయోగించిన తరువాతే హనుమంతుడి ప్రతాపం తగ్గింది. గత రెండు, మూడు నెలలుగా దేశ రాజధానిలో చోటుచేసుకుంటున్న దృశ్యాలు చూస్తుంటే వాల్మీకి రామాయణంలోని సుందరకాండ ఘట్టాలు గుర్తుకు వస్తున్నాయి.

జూలై--ఆగస్టు నెలల్లో ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని కాక్రోచ్ జనతా పార్టీ ఉక్కిరిబిక్కిరి చేసింది. అనేక ఎన్నికల యుద్ధాల్లో ఆరితేరిన ధర్మేంద్ర ప్రధాన్‌ను కేంద్ర మంత్రిమండలి నుంచి తొలగించడం మోదీకి అనివార్యమయింది. భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద మళ్లీ నిరసనకు పూనుకుంటామని సీజేపీ ప్రకటించేసరికి మోదీ సర్కార్ అప్రమత్తమైంది. రెండు రోజుల ముందే సరిహద్దు భద్రతా దళాలు, సాయుధ పోలీసు బలగాలు, కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు, పారామిలటరీ దళాలు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ రంగంలోకి దిగాయి. దాదాపు 50వేల మంది భద్రతా సిబ్బందికి తోడుగా ప్రైవేట్ దళాలు కూడా చేరాయని అంచనా. అడుగడుగునా బారికేడ్లు. పోలీసులు లాఠీలు ఝుళిపించారు. రెండు, మూడు రోజుల పాటు న్యూఢిల్లీలో గాలి కూడా పూర్తిగా స్తంభించినట్లు కనపడింది. సీజేపీ నేతలు అభిజీత్ దీప్కే, సౌరవ్‌దాస్, అశుతోష్ రంకాలను విమానంలోనే అరెస్టు చేసి వేర్వేరు ప్రదేశాలకు తరలించారు. ఢిల్లీలోనే దాదాపు 10వేల మందిని అరెస్టు చేశారు. అనేకమంది ఆన్‌లైన్ వ్యాఖ్యాతలు, కార్యకర్తల్ని కస్టడీలోకి తీసుకున్నారు. అన్ని మెట్రో స్టేషన్లనూ మూసివేశారు. ఢిల్లీకి వచ్చే రైళ్లను రద్దు చేశారు. ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. అయినప్పటికీ కన్నాట్ పస్‌లోనూ, జంతర్ మంతర్ వద్దకు చొచ్చుకువచ్చిన యువతీ యువకులనూ నిర్బంధించారు. మీడియానూ వదలలేదు. బస్సుల నుంచి తప్పించుకుపోకుండా, వాటిలోనే ఇనుప చువ్వలతో లాకప్‌లను నిర్మించారు. దేశ రాజధానిలో యువతరంగం ఉవ్వెత్తున ఎగిస్తే ఏమి జరుగుతుందో అని ప్రభుత్వం భయపడినట్టు ఈ చర్యలతో స్పష్టమయింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో కూడా సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ కింద బ్యానర్లు కట్టారు. సుప్రీంకోర్టు ముందున్న లాయర్ల చాంబర్లలోకి ప్రవేశించి న్యాయవాదులను కూడా అరెస్టు చేశారు. సుప్రీంకోర్టు నుంచి మండీహౌస్‌కు ఊరేగింపుగా వెళుతున్న న్యాయవాదులను అరెస్టు చేసి, యమునా కాంప్లెక్స్‌కు తరలించారు. సీనియర్ న్యాయవాది దినేశ్ ద్వివేది వారిలో ఒకరు. ఎన్నికల కమిషన్ తరఫున వాదిస్తున్న రాకేశ్ ద్వివేదీకి ఆయన స్వయానా సోదరుడు. 'అసలు సుప్రీంకోర్టులోనూ, సుప్రీంకోర్టు ముందు నిషేధాజ్ఞలు విధించేందుకు మీ అనుమతి తీసుకున్నారా?' అని సీనియర్ న్యాయవాది గోపాల్‌శంకర్ నారాయణ్ అడిగిన ప్రశ్నకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఎలాంటి సమాధానమూ ఇవ్వలేదు. తనకూ ఈ నిషేధాజ్ఞల గురించి తెలియదని ప్రభుత్వ ప్రధాన న్యాయవాది సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. న్యాయవాదుల అరెస్ట్‌ను సుప్రీంకోర్టు, హైకోర్టు బార్ అసోసియేషన్లూ, అడ్వకేట్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ ఖండించాయి. చివరకు భారత ప్రధాన న్యాయమూర్తి జోక్యంతో న్యాయవాదులను విడుదల చేశారు. జమ్మూ--కశ్మీర్‌లో ఇంటర్నెట్, టెలీకమ్యూనికేషన్ సదుపాయాలను నిలిపివేయడం రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని అనురాధా బాసిన్ కేసులో జస్టిస్ రమణ బెంచ్ 2020లో ఇచ్చిన తీర్పును పలువురు న్యాయవాదులు ఉటంకించడంతో ఢిల్లీలో నిషేధాజ్ఞలు ఎత్తివేయాలని కేంద్రానికి సీజేఐ సూర్యకాంత్ చెప్పాల్సి వచ్చింది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామాపై ప్రారంభించిన ఉద్యమం వేడి సుప్రీంకోర్టుకు తగిలినట్లే కనపడుతోంది. ఎందుకంటే ఈ విషయంలో సరైన సమయంలో జోక్యం చేసుకోలేని నిస్సహాయతే సుప్రీంకోర్టును ఆత్మరక్షణలో పడేలా చేసింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 12న ఇండియా కూటమి సుప్రీంకోర్టు వరకు నిరసన ఊరేగింపును నిర్వహించింది. ప్రభుత్వం దాదాపు ప్రేక్షక పాత్ర వహించింది. కాంగ్రెస్ చెబుతున్న ప్రకారం... నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ దాదాపు రెండున్నర లక్షల మంది నాలుగు గంటల పాటు న్యూఢిల్లీలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. కాంగ్రెస్, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల కార్యకర్తలే కాకుండా, కాక్రోచ్ పార్టీ పిలుపునకు ప్రతిస్పందించిన విద్యార్థులు, యువజనులు, పౌర సమాజ సభ్యులూ పాల్గొనడంతో కన్నాట్ ప్లేస్ పరిసర ప్రాంతాలు జన సమ్మర్దంతో కిక్కిరిసిపోయాయి. మొట్టమొదటిసారి కాంగ్రెస్ పార్టీ తన బలం యావత్తునూ పూర్తిగా కేంద్రీకరించడంతో వివిధ రాష్ట్రాల నుంచి ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు వేల సంఖ్యలో ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీకి రాకపోతే అధిష్ఠానం ఆగ్రహానికి గురికావల్సి వస్తుందన్న భయం మొదటిసారి కాంగ్రెస్ నేతల్లో కనపడింది. సుప్రీంకోర్టుకు ఊరేగింపు ఒక నెపం మాత్రమేనని, మొత్తం పార్టీలో ఉద్యమ స్ఫూర్తిని, వీధి పోరాట తత్వాన్ని రగల్చడమే రాహుల్‌గాంధీ వ్యూహం అన్న విషయం విదితమయింది. పదవులు ఆశిస్తూ, పైరవీలే ధ్యేయంగా జీవిస్తున్న కాంగ్రెస్ నేతలు మొట్టమొదటిసారి చెమటోడ్చారు. పోలీసులతో రాహుల్, ప్రియాంక వాదిస్తూ, వారిని ప్రతిఘటిస్తూ, బారికేడ్లను దాటుతూ ముందుకు సాగుతుంటే కాంగ్రెస్ కార్యకర్తల్లో కదలిక రాకుండా ఎలా ఉంటుంది? ఒక రకంగా ఇది కాంగ్రెస్ నరనరాల్లో చైతన్యాన్ని రగిల్చిన క్షణం. ఈ నిప్పురవ్వను మరింతగా మండించేందుకే రాహుల్, ప్రియాంక సిద్ధపడుతున్నట్లు కనపడింది. మొదట ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు, ఆ తరువాత సుప్రీంకోర్టు దాకా నిర్వహించారు. ఇక రాష్ట్రాల్లో ప్రకటించిన కార్యాచరణను కాంగ్రెస్ ఎంత ఉద్యమస్ఫూర్తితో నిర్వహిస్తుందో వేచి చూడాలి. ఓట్ చోరీపై ప్రారంభించిన ఈ ఉద్యమం ఓటర్లలో తమ ఓటు హక్కు గురించి చైతన్యాన్ని కల్పించే దిశలో ఊపందుకుంటే కానీ ఆశించిన ఫలితాలు రావు. అదే సమయంలో సర్‌పై, వ్యవస్థల విశ్వసనీయతపై తలెత్తిన వివాదం మోదీ, బీజేపీ ప్రతిష్ఠకు ఎంతవరకు నష్టం వాటిల్లిందో చెప్పేందుకు ఇప్పుడే ఎలాంటి కొలమానాలూ లేవు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ చుట్టూ ఏర్పడిన ప్రతిష్టంభన ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేం. జ్ఞానేశ్ కుమార్‌ను రాజీనామా చేయిస్తే ఓట్ చోరీపై ప్రతిపక్షాల విమర్శలను ప్రభుత్వం ఒప్పుకున్నట్లవుతుంది. ప్రతిపక్షాలు ఎంత రాద్ధాంతం చేసినా, తమ పోరును ఎంత ఉధృతం చేసినా ఎన్నికల్లో మాత్రం తమ యంత్రాంగం, వ్యూహరచన, ఎన్నికల ప్రచారంలో భావోద్వేగ అంశాలు, సామాజిక సమీకరణల ద్వారా విజయాలు సాధించగలమనే విశ్వాసాన్ని మాత్రం బీజేపీ అగ్రనేతలు కోల్పోయినట్లు కనపడడంలేదు. ఎన్నికల్లో తాము గెలిస్తే చాలు, ప్రతిపక్షాలు నీరుగారిపోతాయన్న వ్యూహాన్నే వారు అవలంబిస్తున్నారు. ఈ సందిగ్ధ సంక్షోభ సమయంలో ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారనుందనడంలో సందేహం లేదు. మోదీని గద్దెదించడమనేది కాంగ్రెస్, ఇతర శక్తులకు జీవన్మరణ సమస్యగా మారింది. ఈ శక్తులు తమ పోరును ఉధృతం చేసినకొద్దీ ప్రభుత్వం మరింత కఠోర చర్యలకు పాల్పడే అవకాశాలున్నాయి. రైళ్ల రద్దు, మెట్రో స్టేషన్ల మూసివేత, ప్రజలు తిరిగే చోట నిషేధాజ్ఞలు, ట్రాఫిక్ రద్దీలు, ఇంటర్నెట్‌పై ఆంక్షల మూలంగా వేల సంఖ్యలో సాధారణ ప్రజలకు తీవ్ర అసౌకర్యాలు కలుగక తప్పదు. రాజకీయ, ప్రజా ఉద్యమాలు కేవలం ఢిల్లీలోనే కాకుండా ప్రధానంగా బీజేపీ అధికారంలో ఉన్న 22 ఎన్డీఏ రాష్ట్రాలకు కూడా విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. డీలిమిటేషన్ కోసం ప్రభుత్వం ప్రత్యేక సమావేశాలు నిర్వహించే పరిస్థితి లేకపోగా నవంబర్, డిసెంబర్ నెలల్లో జరిగే శీతాకాల సమావేశాలు కూడా భగ్నమయ్యే అవకాశాలు ఉన్నాయి. రాబోయే ఏప్రిల్‌లో జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వరకూ సంక్షోభం తీవ్రతరం కావడమే కానీ చల్లారే సూచనలు కనపడడం లేదు. ప్రభుత్వం నిరసనలను నిరోధించడానికి ప్రయత్నించి విఫలమైంది. నిషేధాజ్ఞలు విధించి కూడా ఉద్యమకారులను కట్టడి చేయలేకపోయింది. జంతర్ మంతర్‌ను నిరసనలకు కేంద్రం కాకుండా చేయడం తేలికేకానీ ప్రజాగ్రహ అగ్నిపర్వతం నుంచి ఉబికివచ్చిన లావా ప్రవాహాన్ని ఆపలేదు కదా. ఆ ప్రవాహం మరో దారిని వెతుక్కుంది మరి. నిరసన ప్రదర్శనలను దేశభక్తికీ, జాతీయవాదానికీ, విదేశీ కుట్రలకు ముడిపెట్టి ప్రజాభిప్రాయం మళ్లించడం కూడా అంత సులభం కాదు. ఇప్పటి తరానికి ఎమర్జెన్సీ రోజులు తెలియకపోవచ్చు కానీ ప్రస్తుతం అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందన్న అభిప్రాయం వారిలో ఏర్పడుతోంది. అణచివేత, హింసాకాండను ప్రభుత్వమే అమలు చేస్తుంటే, ఈ సోషల్ మీడియా యుగంలో నవతరానికి ఎలాంటి అభిప్రాయం కలుగుతుందో పాలకులు ఆలోచించాలి. ఒక ప్రధాన విజయం సాధించాలంటే అధికారంలో ఉన్నవారు చిన్న చిన్న అపజయాలకు సిద్ధపడక తప్పదు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో నీట్ పేపర్ లీకేజీ అంకానికి తెరపడింది.

# 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్.. మహిళల భాగస్వామ్యం కీలకం: రాష్ట్రపతి ముర్ము

మొదటిపేజీ తరువాయి

విజయవాడ, అక్టోబర్ 15: పున్నమిఘాట్‌లో జాతీయ సరస్ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. విజయవాడకు రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని.. కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునే అవకాశం లభించిందన్నారు. దుర్గాదేవి ఉత్సవాల నేపథ్యంలో పున్నమిఘాట్‌లో ఏర్పాటు చేసిన సరస్ మేళాలో భాగంగా 'లఖ్‌పతి దీదీ' మేళాను నిర్వహించడం ఒక విశేషమైన కలయికగా భావిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణాభివృద్ధి అంటే గ్రామాల వికాసమని చెప్పుకొచ్చారు. మహిళల స్టాళ్లను సందర్శించే అవకాశం దక్కిందని.. వారి ఉత్సాహం, వారి ముఖాల్లోని చిరునవ్వు చూస్తుంటే మహిళలు ఎంతో సంతృప్తిగా ఉన్నారని స్పష్టమవుతోందన్నారు. ఒకప్పుడు మహిళలు వెనుకబడి ఉండేవారని.. కేవలం కుటుంబ సంరక్షణకే పరిమితమై, ఆర్థికంగా చిన్న చిన్న అవసరాల కోసం కూడా ఇతరులపై ఆధారపడే పరిస్థితి ఉండేదని చెప్పుకొచ్చారు. కానీ నేడు మహిళలు సంపూర్ణంగా స్వయం సమృద్ధి సాధించారన్నారు.

### ఇతరులకు ఆసరాగా మహిళలు

మహిళలు కేవలం స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా, ఇతరులకు కూడా ఆసరాగా నిలుస్తున్నారని ముర్ము తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్య సాధనలో మహిళల భాగస్వామ్యం కీలకమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచన, మహిళల సంకల్పం దేశంలోని ముఖ్యమంత్రులందరి ఉమ్మడి కృషి ఫలితంగా మహిళా సాధికారత ముమ్మరంగా సాగుతోందని తెలిపారు. 2047 కంటే ముందే భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందనడంలో ఎటువంటి సందేహం లేదని ధీమా వ్యక్తం చేశారు.

### మహిళల భాగస్వామ్యం పెరిగింది

వ్యవసాయ రంగంలో గ్రామీణ మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమైనదని రాష్ట్రపతి వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ మహిళలకు ఆర్థిక, సాంకేతిక సామాజిక సాధికారత దిశగా కొత్త మార్గం లభించిందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు, కుటుంబంలో ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడంలోనూ మహిళల భాగస్వామ్యం పెరిగిందన్నారు. భారతదేశం భిన్న భాషలు, విభిన్న సంస్కృతులు, వేర్వేరు సంప్రదాయాలు కలిగిన దేశమైనప్పటికీ అంతా ఒక్కటే అని అన్నారు.

### గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో మహిళలకు ప్రాధాన్యం

ప్రస్తుత గ్రామీణ ప్రాంతాల్లో 50 శాతం మంది మహిళలు రాజకీయాల్లో భాగస్వాములవుతున్నారని ద్రౌపది ముర్ము అన్నారు. ఒకప్పుడు బ్యాంకుల వద్దకు వెళ్లడానికి సంకోచించిన మహిళలు, నేడు ఎవరి సాయం లేకుండా స్వయంగా బ్యాంకులకు వెళ్లి తమ పనులను స్వతంత్రంగా చక్కబెట్టుకుంటున్నారని తెలిపారు. అంత్యోదయ సమగ్ర దృక్పథానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తన గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో మహిళలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలే గ్రామాల రూపురేఖలను మార్చే నాయకత్వాన్ని అందిస్తున్నారని చెప్పారు. భారత ప్రభుత్వం లఖ్‌పతి దీదీ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళా సాధికారతకు ఒక ప్రత్యేకమైన వేగం, దిశానిర్దేశం అందించిందన్నారు.

### నైపుణ్యాభివృద్ధిలో కొత్త అవకాశాలు..

డిజిటల్ సేవలు, పునరుత్పాదక ఇంధనం వంటి ఆధునిక రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరుగుతూ, వారికి నైపుణ్యాభివృద్ధిలో కొత్త అవకాశాలు లభిస్తున్నాయని ముర్ము అన్నారు. గవర్నర్‌గా ఉన్న సమయంలో అక్కడి గ్రామీణ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ఆ మహిళలు ల్యాప్‌టాప్‌లను ఉపయోగిస్తూ ఎంత పెట్టుబడి పెడుతున్నారు, ఎంత లాభం పొందుతున్నారు, భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి అనే వివరాలను స్వయంగా ల్యాప్‌టాప్‌లలో నమోదు చేసుకుంటూ పనులు చేసుకునేవారని తెలిపారు. ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని, కుటుంబంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.

## 'సింగరేణి'ని ప్రైవేటీకరణ చేయబోం.. చేయబోనివ్వం: మంత్రి శ్రీధర్‌బాబు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: సింగరేణి సంస్థను దెబ్బతీసే విధంగా బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు ఆక్షేపించారు. ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సింగరేణిని కాపాడింది.. గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. గురువారం మంత్రి మీడియాతో మాట్లాడారు.

ఈ సంస్థను కేసీఆర్ కుటుంబసభ్యులు జేబు సంస్థగా మార్చుకున్నారు. బీఆర్ఎస్ పాలనలో సింగరేణి కార్మికులు ఇబ్బంది పడ్డారు. వారి సంక్షేమం గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదు. సింగరేణి సంస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రసక్తే లేదు. ప్రైవేటీకరణ చేయబోం.. చేయబోనివ్వం. యాదాద్రి పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపిస్తాం."అని మంత్రి స్పష్టం చేశారు.

## 'రూ.3 వేల కోట్ల విదేశీ బొగ్గు స్కామ్ ఆపాలి'.. సీఎంకు కేటీఆర్ బహిరంగ లేఖ

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రూ.3 వేల కోట్ల విదేశీ బొగ్గు కుంభకోణం ఆపాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. కృత్రిమ బొగ్గు కొరత, కరెంటు సంక్షోభం సృష్టించి.. ఆ కంపెనీని రంగంలోకి దించారు. భోత్రా లాజిస్టిక్స్‌తో ప్రభుత్వం, సింగరేణి చేసుకున్న ఒప్పందాలను బయటపెట్టాలి. మొత్తం కుంభకోణంపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. ఇటువంటి వ్యవహారాలను అడ్డుకోవాల్సింది పోయి సహకరిస్తున్నారు. కాంగ్రెస్, భాజపా కలిసి చేస్తున్న కుట్రలను చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో భారత్-అమెరికా తొలి దశ ట్రేడ్ డీల్ ఖరారు: పీయుష్ గోయల్

మొదటిపేజీ తరువాయి

భారత్, అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన తొలి దశ ఖరారైందని , ప్రస్తుతం దీనికి చట్టపరమైన ముసాయిదా రూపకల్పన జరుగుతోందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు.

"అమెరికాతో వాణిజ్య ఒప్పందం మొదటి దశ పూర్తయింది. అందుకు అవసరమైన చట్టపరమైన ముసాయిదా తుది దశలో ఉంది. వీలైనంత త్వరలో ఈ ఒప్పందంపై సంతకాలు జరగనున్నాయి" అని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు. అమెరికా సుంకాలపై అధికారికంగా స్పష్టత వచ్చాకే.. ఈ ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేయనున్నాయని వెల్లడించారు. ఓటర్లు.. జాబితాలో తమ పేరును ముందుగా సరిచూసుకోవాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియెగించుకోవాలని ఆయన కోరారు

## విజయవాడలో జాతీయ సరస్ మేళా ప్రారంభం.. స్టాల్స్‌ను సందర్శించిన రాష్ట్రపతి

మొదటిపేజీ తరువాయి

విజయవాడ, అక్టోబర్ 15: నగరంలోని పున్నమి ఘాట్‌లో జాతీయ సరస్ మేళా ప్రారంభమైంది. ఈరోజు(గురువారం) ఉదయం సరస్ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సీఎం చంద్రబాబు నాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను రాష్ట్రపతి సందర్శించారు. మహిళల ప్రతిభ, మేధస్సును ప్రత్యేకంగా అభినందించారు. సరస్ మేళాలలో దాదాపు 650 స్టాల్స్‌లో హస్తకళలు, చేతి వృత్తులు, ఇతర కళారూపాలను ప్రదర్శిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు. జాతీయ సరస్ మేళా – 2026 కార్యక్రమం నేటి నుంచి ఈ నెల 31 వరకు దాదాపు 14 రోజుల పాటు జరగనుంది. డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు దేశ, విదేశీ స్థాయిలో గుర్తింపు కల్పించే ఉద్దేశంతో సరస్ మేళాను ఏర్పాటు చేశారు. 'స్వయం ఏపీ' బ్రాండ్ పేరుతో డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాన్ని ఏపీ ప్రభుత్వం కల్పిస్తోంది. డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనకు 650 స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ దేశ రాజధాని ఢిల్లీలోనే సరస్ మేళా నిర్వహణ జరుగగా.. తొలిసారిగా ఏపీలో జాతీయ సరస్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

## విచ్ఛిన్నకర శక్తులతో జగన్ చేతులు కలిపారు: పీవీఎన్ మాధవ్

మొదటిపేజీ తరువాయి



అమరావతి: కేసులు ఎదుర్కొంటున్న జగన్‌తో చేతులు కలపడం ద్వారా కాక్రోచ్ జనతా పార్టీ అజెండా ఏంటో స్పష్టమైందని భాజపా ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఎద్దేవా చేశారు. "నాడు ఆలయాల ఆస్తుల ఆక్రమణ, మత మార్పిడులను జగన్ ప్రోత్సహించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేశారు. నేడు రాజకీయ లబ్ధి కోసం దేశ విచ్ఛిన్నకర శక్తులతో చేతులు కలిపారు. వైకాపా పాలనలో ఎదురైన ఇబ్బందులను రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదు.

ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అస్థిరత, విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న శక్తులతో కలిసి జగన్ సాగిస్తున్న రాజకీయ ప్రయత్నాలను వారు నిశితంగా గమనిస్తున్నారు. తగిన సమయంలో ప్రజాస్వామ్యబద్ధంగా తమ తీర్పును వెల్లడిస్తారు" అని పేర్కొన్నారు. సీజేపీకి మద్దతుగా జగన్ చేసిన పోస్టు.. దానికి సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ధన్యవాదాలు తెలపడం ఏపీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

# తేనెటీగలు అంతరించిపోతే మానవ మనుగడకు ముప్పు బీకీపింగ్‌పై అవగాహన కార్యక్రమం

**హైదరాబాద్, అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
తేనెటీగలు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని, పంటల పరాగసంపర్కం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు దోహదపడతాయని నిపుణులు పేర్కొన్నారు. తేనెటీగల పెంపకం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవచ్చని తెలిపారు. బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (దీ×జజ×) తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తేనెటీగల పెంపకం (బీకీపింగ్), విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, ప్రభుత్వ పథకాలపై సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉద్యానవన శాఖ అధికారులు, ఖాదీ అండ్



విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (ఖఎ×జ) హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయ ప్రతినిధులు, మేడ్చల్--మల్కాజిగిరి లీడ్ జిల్లా మేనేజర్ శివ ప్రసాద్ సహకారం అందించారు. ఈ సందర్భంగా తేనెటీగల పెంపక శిక్షకుడు, రాష్ట్రస్థాయి బీకీపింగ్ అవార్డు గ్రహీత పండుగ పరిపూర్ణ తేనెటీగల పెట్టె ద్వారా ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించి, తేనెటీగల పెంపక విధానాలు, తేనె ఉత్పత్తి, తేనెతో పాటు ఇతర



విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ గురించి వివరించారు. పాల్గొన్నవారు ప్రదర్శనను ఆసక్తిగా తిలకించి, బీకీపింగ్‌లోని ఆచరణాత్మక అంశాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల ప్రతినిధులు, బ్యాంకింగ్ రంగ అధికారులు, శిక్షకులు, దీ×జజ× ప్రతినిధులు, స్వయం ఉపాధిపై ఆసక్తి కలిగిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. తేనెటీగల పెంపకాన్ని ఉపాధి మార్గంగా ఎంచుకోవాలనుకునే వారికి ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు, శిక్షణ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# నాగల్‌గిద్ద మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి..

**అక్టోబర్ 16(సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్)**

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం నాగల్‌గిద్ద మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈరోజు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని, మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై అధికారులు, సర్పంచులు, ఉపసర్పంచులు మరియు పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావం కారణంగా వర్షపాతం, నీటి నిల్వలపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున త్రాగునీటిని




మరియు విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచించారు. ఏ గ్రామంలోనూ త్రాగునీటి లేదా విద్యుత్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరా వ్యవస్థలు మరియు విద్యుత్ మౌలిక సదుపాయాలను నిరంతరం పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా చూసుకోవాలని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు. దీనికోసం సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు అధికారులతో కలిసి సమన్వయంగా పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమ పూర్తి సహకారం అందుబాటులో ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి మౌలిక వసతులు, త్రాగునీటి సరఫరా, విద్యుత్ వినియోగ నిర్వహణ ముఖ్యమని ఎమ్మెల్యే గారు అన్నారు. ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి, సమాధాన పరిష్కారాలు అందించేలా ప్రతి గ్రామ పంచాయతీ ప్రతినిధి బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్ మండలానికి సంబంధించిన అధికారులు సర్పంచులు మరియు పంచాయతీ కార్యదర్శులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధే ధ్యేయం

- శానిటేషన్ పటిష్టంగా అమలు చేయాలి.. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- నగరాభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి: జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్, అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
జిల్లాలోని మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణను పటిష్టంగా అమలు చేయడంతో పాటు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణాభివృద్ధి పనులను వేగవంతం చేసి మున్సిపాలిటీలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని



స్పష్టం చేశారు. మెదక్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో గురువారం మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీల కమిషనర్లు, సిబ్బందితో అదనపు కలెక్టర్ నగేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై సమీక్షించారు. మున్సిపాలిటీలు ప్రగతి పథంలో ముందుకు సాగేందుకు కమిషనర్లు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ సిబ్బందితో సమగ్ర కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. పట్టణాలు, ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలను భాగస్వాములను చేస్తూ పారిశుద్ధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి: మున్సిపాలిటీల పరిధిలో ఆస్తి పన్నుల వసూళ్లను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. పన్నుల వసూళ్లలో 100 శాతం లక్ష్యాన్ని సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# రజక సంఘం ఆడపడుచులకు చిరు కానుకలు అందజేసిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ

**జోగిపేట, అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో రజక సంఘం ఆడపడుచులు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు వివిధ రకాల అందమైన పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా అందోల్--జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) ప్రతి ఇంటి ఆడపడుచుకు చిరు కానుకలను అందజేశారు. బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందాలు, సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలంతా ఐక్యంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీలోని పెద్దలు, యువకులు, చిన్నపిల్లలు పాల్గొని బతుకమ్మ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తనను ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన రజక సంఘం మహిళలకు ఆకుల సత్యనారాయణ పేరుపేరునా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.



# సింగూర్ ప్రాజెక్టును పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్



**పుల్కల్, అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి మహేష్ బాబు):**
సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూర్ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులోని నీటి నిల్వలు, ప్రస్తుత పరిస్థితి, నీటి వినియోగం తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భవిష్యత్తులో తాగునీటి అవసరాలను తీర్చేందుకు అందుబాటులో ఉన్న నీటి వనరుల నిర్వహణపై అధికారులతో సమీక్షించి, ప్రాజెక్టు పరిసర ప్రాంతాల పరిస్థితులను పరిశీలించారు. అనంతరం పెద్దారెడ్డిపేటలోని 90 ఎంఎల్‌డీ మిషన్ భగీరథ ప్లాంటును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జిల్లా కలెక్టర్ ప్రాతిక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో పాటు సంబంధిత అధికారులు సందర్శించారు.

# పెద్దారెడ్డిపేటలో బతుకమ్మ పండుగకు భారీ ఏర్పాట్లు





**పుల్కల్, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి మహేష్ బాబు):**
సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట గ్రామంలో ఆదివారం నిర్వహించనున్న బతుకమ్మ పండుగకు గ్రామ సర్పంచ్ కుమ్మరి అనసూయ లింగయ్య ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ ఆడపడుచులు బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు గ్రామ చెరువు కట్ట వద్ద అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. సంగమేశ్వర స్వామి ఆలయం సమీపంలో బతుకమ్మ ఆడే ప్రదేశంలో రూ.40 వేల నుంచి రూ.50 వేల వ్యయంతో డే లైట్లు, సీరియల్ లైట్లు, డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నారు. బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కుమ్మరి అనసూయ లింగయ్య పెద్దారెడ్డిపేట గ్రామ ఆడపడుచులకు, ప్రజలకు ముందస్తుగా బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# దుర్గామాతకు ప్రత్యేక పూజలు..



**అక్టోబర్ 16(సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్)**
నర్సాపూర్ పట్టణంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ శ్రీ లక్ష్మీ రాజు యాదవ్ గారు దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని, నర్సాపూర్ పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు

జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్
16-10-2026

# గ్రామపంచాయతీ కార్మికులకు దసరా కానుకగా దుస్తుల పంపిణీ



**వట్పల్లి, అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం గొర్రెకల్ గ్రామపంచాయతీలో దసరా పండుగ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికులకు తిరుపతి నరసింహారెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికులకు దుస్తులు అందించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా పండుగను పురస్కరించుకొని కార్మికులకు దుస్తులు అందజేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో, పారిశుద్ధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులను గౌరవిస్తూ దసరా కానుకగా దుస్తులు అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# రూ.1.20 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ విద్యుత్ ఏఈ

- ఆరు కొత్త విద్యుత్ మీటర్ల మంజూరు కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు

**హైదరాబాద్, అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



హైదరాబాద్ పాతబస్తీలోని సంతోష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ శాఖకు చెందిన అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) రాకేష్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడినట్లు సమాచారం. మదన్నపేట సెక్షన్‌కు చెందిన ఆయన ఆరు కొత్త విద్యుత్ మీటర్ల మంజూరు కోసం రూ. 1,20,000 లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో లంచం సొమ్ము తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అందోల్-జోగిపేటలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు





- ఆటపాటలు, నృత్యాలతో సందడి చేసిన ఆడపడుచులు

**జోగిపేట, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ జిల్లా ప్రతినిధి):** అందోల్–జోగిపేట పట్టణంలో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మున్సిపల్ చైర్మన్ సోమిరెడ్డి కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి ఒకేచోట ఏర్పాటు చేశారు. అనంతరం సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలు, నృత్యాలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి బతుకమ్మ ఘాట్ వద్ద నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎమ్మార్వో సాగర్ మధుకర్ రెడ్డి, ఏఈ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు డాకూరి వెంకటేశం, మాజీ మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, తాజా, మాజీ కౌన్సిలర్లు సురేందర్ గౌడ్, పట్లోళ్ల ప్రవీణ్ కుమార్, గడ్డి అరుణ్, కోషికె శేఖర్, కోఆప్షన్ సభ్యుడు జిశాన్, కోరబోయిన నాగరాజ్, పట్లోళ్ల శ్రీనివాస్, తోట్ల రామకృష్ణ, కొత్త శ్రీశైలం, శరత్, అప్ప, నందు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పలు గ్రామాల్లో నూతన విద్యుత్ నియంత్రికల ప్రారంభం

- రేపల్లెవాడ--ప్రొద్దుటూరు మధ్య 2.4 కిలోమీటర్ల 11 కేవీ విద్యుత్ లింక్ లైన్ ప్రారంభం

**చింతకాని, అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచే లక్ష్యంతో నూతన విద్యుత్ నియంత్రికలను ప్రారంభించారు. మధిర డివిజనల్ ఇంజనీర్ ఆధ్వర్యంలో రామకృష్ణాపురం, కోడుమూరు, లచ్చగూడెం, నేరెడ, కోమట్లగూడెం గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రికలను ప్రారంభించారు. అదేవిధంగా రేపల్లెవాడ--ప్రొద్దుటూరు గ్రామాల మధ్య 2.4 కిలోమీటర్ల



పొడవున ఏర్పాటు చేసిన 11 కేవీ విద్యుత్ లింక్ లైన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజనల్ ఇంజనీర్ బి. శ్రీనివాసరావు, బోనకల్ సహాయ డివిజనల్ ఇంజనీర్ వై.వి. ఆనంద్ కుమార్ రైతులు, విద్యుత్ వినియోగదారులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, రానున్న రోజుల్లో ఎదురయ్యే నీటి ఎద్దడి, విద్యుత్ వినియోగం తదితర అంశాలపై చర్చించారు. విద్యుత్‌ను అవసరమైన మేరకే పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరా పరిస్థితులపై రైతుల అభిప్రాయాలను సేకరించి, వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా మరింత మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో చింతకాని విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ శ్రీధర్‌తో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం.. వరి వద్దు.. ప్రత్యామ్నాయ పంటలే ముద్దు

రైతులకు సూచించిన మండల వ్యవసాయాధికారి పి. సతీష్

**చింతకాని, అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటడం, నీటి కొరత ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు రాబోయే సీజన్‌లో వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని చింతకాని మండల వ్యవసాయాధికారి పి. సతీష్ సూచించారు. మండలంలోని లచ్చగూడెం గ్రామంలో రైతులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో వరి సాగు చేయడం వల్ల పంట నష్టంతో పాటు భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. తక్కువ నీటితో సాగు చేయగల పెసర, మినుము, జొన్న, సజ్జ, రాగులు వంటి అపరాలు, చిరుధాన్యాల పంటలను సాగు చేయడం ద్వారా పెట్టుబడి ఖర్చును తగ్గించుకోవడంతో పాటు నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని వివరించారు. మార్కెట్‌లో ఈ పంటలకు మంచి



ధర లభించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లచ్చగూడెం గ్రామ సర్పంచ్ కొప్పుల రజిని, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు బి. కార్తీక్, ఎస్‌కే అయేషా ఫాతిమా, సుమారు 30 మంది రైతులు పాల్గొన్నారు. స్థిరమైన వ్యవసాయం దిశగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని అధికారులు సూచించారు.

- ప్రకృతి వ్యవసాయంలో క్యాప్సికం సాగు ఆదర్శం
- పంట క్షేత్రాన్ని పరిశీలించిన వ్యవసాయాధికారి పి. సతీష్

**చింతకాని, అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ ఆరోగ్యకరమైన పంటలను సాగు చేయడం అభినందనీయమని చింతకాని మండల వ్యవసాయాధికారి పి. సతీష్ అన్నారు. మండలంలోని లచ్చగూడెం గ్రామంలో సీవీసీఖీ (ప్రకృతి వ్యవసాయ పథకం) కింద సాగు చేస్తున్న క్యాప్సికం పంట క్షేత్రాన్ని ఆయన పరిశీలించారు. దీ=జ ద్వారా నిర్వహిస్తున్న ఈ క్షేత్రంలో రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పంటను సాగు చేస్తున్నారు. పంటను ఆశించే పురుగుల పర్యవేక్షణ కోసం సోలార్ లైట్ ట్రాప్‌లు, పసుపు, నీలం రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేశారు. రసాయన పురుగుమందులకు బదులుగా ఎంటమోపాథోజెనిక్ నెమటోడ్స్ (జూచీ) వంటి జీవ నియంత్రణ పద్ధతులను వినియోగిస్తూ, శుభ్రమైన వ్యవసాయ విధానాలను పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన పంటను సాగు చేస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఈ క్యాప్సికం పంట క్షేత్రం ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తుందని వ్యవసాయాధికారి అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు బి. కార్తీక్, ఎస్‌కే అయేషా ఫాతిమా, సీవీసీఖీ దీ=జ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# వరి పంట ఎండిపోవడంతో రైతు ఆత్మహత్య

- బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: ఎంపీ రఘునందన్ రావు

**శివంపేట, అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** వరి పంటకు సరిపడా నీరు అందక పంట ఎండిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రైతు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. భీమ్లా తండా గ్రామపంచాయతీ పరిధిలోని శంకర్ తండాకు చెందిన మాలోత్ శంకర్ తన పొలంలో వరి పంట సాగు చేశాడు. అయితే పంటకు అవసరమైన నీరు అందకపోవడంతో వరి ఎండిపోయింది. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన ఆయన బుధవారం తన పొలంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయ అవసరాలకు సరిపడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర





విషాదంలో మునిగిపోయారు.

**బాధిత కుటుంబానికి ఎంపీ పరామర్శ**

రైతు మాలోత్ శంకర్ మృతి విషయం తెలుసుకున్న మెదక్ ఎంపీ రఘునందన్ రావు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమవడం వల్ల సాగు చేసిన పంటలు దెబ్బతిని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా కార్యదర్శి అశోక్ సాదుల, మండల అధ్యక్షుడు పెద్దపులి రవి, భీమ్లా తండా సర్పంచ్ లక్ష్మీ దుర్గ నాయక్, ఉపసర్పంచ్ కంస వెంకటేష్ నాయక్, ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో దూసుకుపోతున్న చౌటకూర్



ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు..

**అక్టోబర్ 16( సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్)** సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గ పరిధిలోని చౌటాకూర్ మండలం చౌటకూర్ గ్రామం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గ్రామ సర్పంచ్ పార్కల రాంరెడ్డి, పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామంలో అండర్ డ్రైనేజీతో పాటు పలు అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతం కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా జరగని అభివృద్ధి పనులు ప్రస్తుతం వేగంగా ముందుకు సాగుతున్నాయని, సర్పంచ్ పార్కల రాంరెడ్డి నాయకత్వంలో గ్రామం అభివృద్ధి దిశగా పయనిస్తోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అండర్ డ్రైనేజీ వంటి పనులతో గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపడటంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్న సర్పంచ్, పాలకవర్గంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చౌటకూర్ గ్రామ అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తూ, 56 ఏళ్ల చరిత్రను తిరగరాస్తున్నామని గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

# సక్సెషన్ కోసం రూ.5 లక్షలు డిమాండ్.. రూ.2.50 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన రెవెన్యూ అధికారులు

- కీసర డిప్యూటీ తహసీల్దార్ సందీప్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ రెడ్డి, రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణపై ఏసీబీ చర్యలు



**మేడ్చల్ జిల్లా, అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
భూమి సక్సెషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేశారనే ఆరోపణల నేపథ్యంలో రూ.2.50 లక్షలు తీసుకుంటుండగా కీసర తహసీల్దార్ కార్యాలయానికి చెందిన ముగ్గురు రెవెన్యూ అధికారులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడినట్లు సమాచారం. కీసర డిప్యూటీ తహసీల్దార్ సందీప్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ రెడ్డి, రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణ ఈ ఘటనలో ఉన్నట్లు తెలిసింది.
మూడు ఎకరాల భూమి సక్సెషన్ కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు
వివరాల్లోకి వెళ్తే.. కీసరకు చెందిన పన్నాల బుచ్చిరెడ్డి భార్య పన్నాల సుశీల ఇటీవల మృతి చెందారు. ఆమె పేరు మీద సర్వే నంబర్లు 183, 184లో ఉన్న మూడు ఎకరాల భూమిని సక్సెషన్ ద్వారా తన పేరు మీదకు మార్చుకునేందుకు పన్నాల గిరిధర్ రెడ్డి సంబంధిత రెవెన్యూ కార్యాలయాన్ని సంప్రదించారు. అయితే, సదరు భూమి 22-ఏ జాబితాలో ఉందని, సక్సెషన్ ప్రక్రియ పూర్తి చేయాలంటే సుమారు రూ.5 లక్షలు చెల్లించాలని డిప్యూటీ తహసీల్దార్ సందీప్ రెడ్డి డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. భూమిని 22-ఏ జాబితా నుంచి తొలగించేందుకు తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఆర్డీఓ కార్యాలయంలోనూ డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని బాధితుడికి చెప్పినట్లు సమాచారం.

**నగదు తీసుకుంటుండగా ఏసీబీ దాడి**
ఈ నేపథ్యంలో బాధితుడు పన్నాల గిరిధర్ రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు తెలిసింది. ముందుగా రూ.2.50 లక్షల నగదును కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ రెడ్డికి అందజేసినట్లు సమాచారం. అనంతరం ఆయన ఆ నగదును రికార్డు అసిస్టెంట్ బాలకృష్ణకు ఇచ్చినట్లు తెలిసింది. బాలకృష్ణ ఆ డబ్బును డిప్యూటీ తహసీల్దార్ సందీప్ రెడ్డి గదిలోకి తీసుకెళ్లి ఆయన బ్యాగులో పెడుతున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై ఏసీబీ డీసీపీ ఆనంద్ కుమార్ వివరాలు వెల్లడించినట్లు తెలిసింది. సక్సెషన్ వంటి కీలకమైన ప్రభుత్వ సేవల కోసం లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ దర్యాప్తు, తదుపరి చర్యల వివరాలు తెలియాల్సి ఉంది.

# ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు క్రమశిక్షణతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

- ఉచిత కోచింగ్ తరగతులను సందర్శించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**జోగిపేట, అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు క్రమశిక్షణతో చదువుతూ, నిరంతర సాధనతో లక్ష్యాన్ని చేరుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ సూచించారు. గురువారం జోగిపేటలోని నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభ్యర్థులకు అందిస్తున్న ఉచిత పోలీస్ కోచింగ్ తరగతులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడి, వారి సన్నద్ధతను తెలుసుకున్నారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే సమయాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు పట్టుదల, క్రమశిక్షణతో చదవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అభ్యర్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ వారి విజయానికి కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్, జోగిపేట సీఐ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దసరా వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి..

- అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటు చేయనున్న 55 అడుగుల రావణాసురుడి బొమ్మ...
- స్టేడియం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, దసరా వేడుకలకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచన
- కార్యక్రమం లో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, భవాని యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, సభ్యులు, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, కిరణ్ గౌడ్, శ్రీహరి





**అక్టోబర్ 16(సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్)**
సంగారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో దసరా ఉత్సవాల కోసం జరుగుతున్న ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం పరిశీలించారు. రావణ దహనం కోసం సిద్ధం చేస్తున్న 55 అడుగుల రావణాసురుడి బొమ్మతో పాటు బాణసంచా కాల్చేందుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. గత ముప్పై ఏళ్లుగా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్టేడియంలో ఏటా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. భారీ రావణాసురుడి బొమ్మ దహనం, పెద్ద ఎత్తున బాణసంచా ప్రదర్శనతో పాటు ప్రముఖ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జగ్గారెడ్డి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్ల పరిశీలన సందర్భంగా స్టేడియంతో పాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జగ్గారెడ్డి సూచించారు. ముళ్లకంపలను తొలగించి, చెత్తాచెదారం లేకుండా మైదానాన్ని శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందికి, ఉత్సవ నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, భవాని యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బెస్త నగేష్, సభ్యులు, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, కిరణ్ గౌడ్ , శ్రీహరి తదితరులు పాల్గొన్నారు

# సంగారెడ్డి జిల్లాలో భూ రీ-సర్వేకు ప్రత్యేక బృందాలు

- కిచ్చన్నపల్లిలో రెవెన్యూ సిబ్బందికి క్షేత్రస్థాయి శిక్షణ



**అందోల్, అక్టోబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ-సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు సంగారెడ్డి జిల్లాలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి రెండు గ్రామాల చొప్పున ఎంపిక చేసి, సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రత్యేక బృందాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించగా, గురువారం అందోల్ మండలంలోని కిచ్చన్నపల్లి గ్రామంలో రెవెన్యూ సిబ్బందికి క్షేత్రస్థాయి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా భూముల కొలతలు, సర్వేలో అనుసరించాల్సిన సాంకేతిక విధానాలు, భూముల సరిహద్దుల గుర్తింపు, రైతుల సందేహాల నివృత్తి తదితర అంశాలపై నిపుణులు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. రీ-సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో తహశీల్దార్ మధుకర్ రెడ్డి, ఏడీ ఐనేష్, డీఐ, సర్వేయర్లు మురళి, యాదయ్యతో పాటు వివిధ మండలాలకు చెందిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు), నాయబ్ తహశీల్దార్లు, సర్వేయర్లు, జీపీవోలు పాల్గొని క్షేత్రస్థాయి శిక్షణ పొందారు.

# జోగిపేట 15వ వార్డులో ఘనంగా బతుకమ్మ సంబరాలు






- బాల్య వివాహాలను అరికట్టాలి.. బాలికల విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి
- మహిళలు, బాలికల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**బోరంచ, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండల పరిధిలోని బోరంచ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మహిళలు, బాలికల హక్కులు, భద్రత, సంక్షేమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త గడ్డం పల్లవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాల్య వివాహాల నిర్మూలన, బాలికల విద్య ప్రాముఖ్యత, మహిళా సాధికారత తదితర అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గడ్డం పల్లవి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. బాలికలకు చిన్న వయస్సులోనే వివాహాలు చేయకుండా ఉన్నత విద్యను అందించి, వారు స్వతంత్రంగా జీవించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. మహిళలు, బాలికల హక్కులను పరిరక్షించడం, వారికి సమాన అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. మహిళలపై హింస, వివక్ష, బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు, బాలికల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన పెంచుకొని, అర్హులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప మాట్లాడుతూ బాలికల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే నాణ్యమైన విద్యతో పాటు వారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలని, బాలికలు చదువులో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. మహిళలు, బాలికల అభివృద్ధికి గ్రామస్థులందరూ సహకరించాలని, మహిళలకు గౌరవం, సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్షియల్ స్పెషలిస్ట్ పుల్కంటి నర్సింలు, గ్రామ ఉపసర్పంచ్ మొల్ల కరీం, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, యువత పాల్గొన్నారు.

# పండుగల వేళ మానవీయ సేవ..

బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని వస్త్రాల పంపిణీ..

**అక్టోబర్ 16(సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్)**



బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జవీజ) పటాన్‌చెరు సర్కిల్ పరిధిలోని మున్సిపల్ బిల్ కలెక్టర్లు, సిబ్బందికి సంగారెడ్డి జిల్లా డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్స శ్యామ్ రావు, ఆయన సతీమణి పద్మ నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా ఉస్మాన్ నగర్ గ్రామ ప్రజలకు కూడా నూతన వస్త్రాలను అందజేశారు. పండుగల వేళ ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో మున్సిపల్ సిబ్బంది, బిల్ కలెక్టర్లు, గ్రామ ప్రజలకు వస్త్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పర్స శ్యామ్ రావు దంపతులు అందరికీ బతుకమ్మ, విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. విజయదశమి పండుగను ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. నూతన వస్త్రాల పంపిణీ పట్ల మున్సిపల్ సిబ్బంది, బిల్ కలెక్టర్లు, ఉస్మాన్ నగర్ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ పర్స శ్యామ్ రావు దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

# బీబీపేట్ పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ రాజేష్ చంద్ర..



(సందేశం టైమ్స్ ప్రతినిధి):
బీబీపేట్ పోలీస్ స్టేషన్ ను గురువారం కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామాలలో దొంగతనాలు ఇతర ఆస్తి సంబంధిత నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమైన ప్రాంతాల్లో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తుల కార్యకలాపాలపై నిఘా ఉంచాలని,112 ద్వారా వచ్చే అత్యవసర కాల్స్ కు వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు తగిన సహాయం అందించాలని, దొంగతనం కేసులను త్వరితగతన ఛేదించి నిందితులను పట్టుకొని బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యత యుతంగా నిర్వహిస్తూ ప్రజలకు క్రమశిక్షణతో కూడిన మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీబీపేట్ ఎస్సై నవీన్ చంద్ర మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇతర రాష్ట్రాల మద్యం అక్రమ రవాణా.. 103 బాటిళ్లు స్వాధీనం..

**-ఒకరి అరెస్ట్.. కిష్టాపూర్ శివారులో ఎస్టీఎఫ్ అధికారుల దాడి**



(సందేశం టైమ్స్ ప్రతినిధి):
ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్) అధికారులు పట్టుకున్నారు. బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి నిర్వహించిన దాడిలో 103 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేశారు.లింగంపేట్ మండలం బాణాపూర్ తండాకు చెందిన ధరావత్ ప్రతాప్ ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు ఎస్టీఎఫ్ అధికారులకు సమాచారం అందింది. దీంతో ఎస్టీఎఫ్ సీఐ కె. వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి కిష్టాపూర్ గ్రామ శివారులో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న ప్రతాప్‌ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఉన్న 103 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.ఇతర రాష్ట్రాల నుంచి మద్యాన్ని అక్రమంగా తీసుకురావడం, నిల్వ చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని అధికారులు హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎక్సైజ్ అధికారుల నిఘా పెంచాలి మండల పరిధిలో ఇతర రాష్ట్రాల మద్యం అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో స్థానిక ఎక్సైజ్ అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేసి, అక్రమ మద్యం రవాణా, నిల్వలు, విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, చట్టవిరుద్ధమైన మద్యం వ్యాపారాన్ని నియంత్రించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# అధునాతన న్యూరోసర్జరీ చికిత్సలకు యశోద హాస్పిటల్స్‌లో ప్రత్యేక కేంద్రం..

**-న్యూరోఎండోస్కోపీ, రోబోటిక్ సాంకేతికతతో మెదడు, వెన్నెముక సమస్యలకు ఆధునిక చికిత్సలు**

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
మెదడు, వెన్నెముక సంబంధిత సంక్లిష్ట వ్యాధులకు అత్యాధునిక వైద్య సాంకేతికతతో మెరుగైన చికిత్సలు అందించేందుకు యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్‌లోని యశోద సెంటర్ ఫర్ న్యూరోఎండోస్కోపీ అండ్ రోబోటిక్ న్యూరోసర్జరీ ప్రత్యేక సేవలను అందిస్తోంది. న్యూరోఎండోస్కోపీ, రోబోటిక్ సహాయక శస్త్రచికిత్సలు, అధునాతన ఇమేజింగ్ సాంకేతికతను సమన్వయం చేస్తూ రోగులకు వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్సలు అందిస్తోంది.డా. అయ్యదురై ఆర్, డా. కృష్ణ తేజ్ రెడ్డి ఆధ్వర్యంలో మెదడు కణితులు, మందులతో నియంత్రణలోకి రాని మూర్ఛ, ట్రైజెమినల్ న్యూరల్జియా, మెదడులో రక్తస్రావం, వెన్నెముక సమస్యలకు ఆధునిక శస్త్రచికిత్సా విధానాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. సాధ్యమైన సందర్భాల్లో శస్త్రచికిత్స వల్ల కలిగే కణజాల నష్టాన్ని తగ్గించడం, రోగులు త్వరగా కోలుకునేందుకు తోడ్పడటం ఈ విధానాల ప్రధాన లక్ష్యమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.మెదడు కణితులకు అధునాతన శస్త్రచికిత్సలు మెదడు కణితుల స్థానం, పరిమాణం, రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి ఎండోస్కోపిక్, రోబోటిక్ సహాయక శస్త్రచికిత్సా విధానాలను ఎంపిక చేస్తున్నారు. శస్త్రచికిత్స జరుగుతున్న సమయంలోనే ఎంఆర్ఐ చిత్రాలను పొందే ఇంట్రాఆపరేటివ్ ఎంఆర్ఐ (ఐ.ఎం.ఆర్ ఐ) సాంకేతికత అందుబాటులో ఉండటం ప్రత్యేకతగా నిలుస్తోంది. దీనివల్ల కణితి తొలగింపు స్థాయిని అంచనా వేసి, మెదడులోని కీలక భాగాలను కాపాడుతూ సాధ్యమైనంత సురక్షితంగా కణితిని తొలగించేందుకు వైద్యులకు సహకారం లభిస్తుంది. మూర్ఛ వ్యాధికి ప్రత్యేక చికిత్సలు సరైన మందులు వాడుతున్నప్పటికీ మూర్ఛ నియంత్రణలోకి రాని రోగులకు వ్యక్తిగత వైద్య పరీక్షల ఆధారంగా శస్త్రచికిత్సా చికిత్సలను అందిస్తున్నారు. రోగి పరిస్థితి, మూర్ఛకు కారణమయ్యే మెదడు భాగం, శస్త్రచికిత్సకు అనుకూలతను పరిశీలించి రోబోటిక్ సహాయక విధానాలు సహా తగిన చికిత్సను ఎంపిక చేస్తున్నారు. మూర్ఛ నియంత్రణను మెరుగుపరచడంతోపాటు రోగుల జీవన ప్రమాణాలను పెంచడం లక్ష్యంగా పనిచేస్తున్నారు. ట్రైజెమినల్ న్యూరల్జియాకు ఆధునిక చికిత్స ట్రైజెమినల్ న్యూరల్జియా అనేది ముఖంలో అకస్మాత్తుగా తీవ్రమైన విద్యుత్ షాక్ తగిలినట్లుగా నొప్పిని కలిగించే సమస్య. ఈ వ్యాధితో బాధపడుతున్న ఎంపిక చేసిన రోగులకు ఎండోస్కోపిక్ మైక్రోవాస్కులర్ డీకంప్రెషన్ (వీఎఱ) శస్త్రచికిత్సను అందిస్తున్నారు. రక్తనాళాల ఒత్తిడి వల్ల నరంపై ఏర్పడిన కుదింపును తగ్గించడం ద్వారా తగిన రోగుల్లో దీర్ఘకాలిక నొప్పి ఉపశమనానికి ఈ విధానం దోహదపడుతుంది. ఈ కేంద్రంలో ఇప్పటివరకు 110 ట్రైజెమినల్ న్యూరల్జియా శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ వ్యాధిపై అవగాహన పెంచడం, ముందస్తు నిర్ధారణను ప్రోత్సహించడం, రోగులకు సరైన వైద్య సలహా అందించడం లక్ష్యంగా అక్టోబర్ 7న ప్రత్యేక ట్రైజెమినల్ న్యూరల్జియా క్లినిక్, అవగాహన బృందాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా రోగులు, వారి కుటుంబ సభ్యులకు వ్యాధి లక్షణాలు, అందుబాటులో ఉన్న చికిత్సా విధానాలపై అవగాహన కల్పించనున్నారు. మెదడులో రక్తస్రావానికి కనిష్ట ఇన్వాసివ్ విధానాలు హెమరేజిక్ స్ట్రోక్ కారణంగా మెదడులో రక్తస్రావం జరిగిన ఎంపిక చేసిన సందర్భాల్లో ఎండోస్కోపిక్ పద్ధతుల ద్వారా రక్తం




గడ్డలను తొలగించే చికిత్సలను అందిస్తున్నారు. రక్తస్రావం జరిగిన ప్రాంతం, పరిమాణం, రోగి నాడీ వ్యవస్థ పరిస్థితిని బట్టి చికిత్సా విధానాన్ని నిర్ణయిస్తారు. తగిన సందర్భాల్లో పెద్ద శస్త్రచికిత్స అవసరాన్ని తగ్గించే అవకాశం ఉన్నప్పటికీ, ప్రతి రోగికి అనుకూలమైన పద్ధతిని వైద్యుల బృందం నిర్ణయిస్తుంది. వెన్నెముక సమస్యలకు కనిష్ట ఇన్వాసివ్ శస్త్రచికిత్సలు వెన్నెముక సంబంధిత సమస్యలకు ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ, కనిష్ట ఇన్వాసివ్ శస్త్రచికిత్సలు, తగిన రోగులకు డే కేర్ చికిత్సా విధానాలను అందిస్తున్నారు. వ్యాధి తీవ్రత, రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి చికిత్సను ఎంపిక చేస్తారు. అవసరమైన సందర్భాల్లో కణజాలానికి కలిగే నష్టాన్ని, శస్త్రచికిత్స అనంతర అసౌకర్యాన్ని, ఆసుపత్రిలో ఉండాల్సిన సమయాన్ని తగ్గించేందుకు ఈ విధానాలు దోహదపడతాయి.రోగి కేంద్రంగా సమగ్ర న్యూరోసర్జరీ సేవలు అత్యాధునిక వైద్య పరికరాలు, ప్రత్యేక న్యూరోసర్జరీ నైపుణ్యం, ఎండోస్కోపిక్ సాంకేతికత, రోబోటిక్ సహాయక శస్త్రచికిత్సలను ఒకే వేదికపై అందిస్తూ యశోద సెంటర్ ఫర్ న్యూరోఎండోస్కోపీ అండ్ రోబోటిక్ న్యూరోసర్జరీ సేవలు అందిస్తోంది. మెదడు, వెన్నెముక సంబంధిత వ్యాధులకు రోగి అవసరాలకు అనుగుణంగా తగిన చికిత్సను అందించడం, వైద్యపరంగా సాధ్యమైన చోట త్వరగా కోలుకునేందుకు సహకరించడం కేంద్రం ప్రధాన ఉద్దేశమని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.
2

# సారస్ మేళా-2026లో కామారెడ్డి మహిళల విజయాలు అభినందనీయం..

**-మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం సహాయక సంఘాలు దోహదం**

**మహిళా సంఘాల సభ్యులు,**

**-ప్రోత్సహిస్తున్న సిబ్బందిని అభినందించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ మైదానంలో నిర్వహిస్తున్న సారస్ మేళా--2026లో కామారెడ్డి జిల్లాకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తూ, విక్రయాలు చేపడుతూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధిస్తూ విజయగాథలు సృష్టించడం సంతోషకరమని పేర్కొన్నారు.సారస్ మేళాలో సంప్రదాయ వంటకాలు, పచ్చళ్లు, చిరుధాన్య ఉత్పత్తులు, గానుగ నూనెలను విక్రయిస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న దేవల సరోజ, కే. సుజాత, మోతే సుప్రియలను జిల్లా కలెక్టర్ అభినందించారు. మహిళలు తమలోని నైపుణ్యాలను వ్యాపార అవకాశాలుగా మలుచుకుని ఆదాయం పొందడంతో పాటు, ఇతర మహిళలకు ఉపాధి కల్పించడం స్ఫూర్తిదాయకమని అన్నారు. పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసంతో మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించగలరని ఈ విజయాలు నిరూపిస్తున్నాయని పేర్కొన్నారు.మహిళల ఆర్థికాభివృద్ధికి స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. సంఘాల ద్వారా అందుతున్న పొదుపు, రుణ సదుపాయాలు, బ్యాంకుల సహకారం, ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంప్రదాయ ఉత్పత్తుల తయారీకే పరిమితం కాకుండా, వాటికి నాణ్యతను జోడించి మార్కెటింగ్ నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా వ్యాపారాన్ని మరింత విస్తరించుకోవచ్చని అన్నారు.మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించి, వాటికి మరిన్ని మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో లభించే స్థానిక వనరులను వినియోగించుకుంటూ తయారు చేసే ఉత్పత్తులకు వినియోగదారుల్లో ఆదరణ పెరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళలు తమ ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు కూడా పరిచయం చేస్తూ, వ్యాపార రంగంలో మరింత పురోగతి సాధించేలా అవసరమైన సహకారం అందించాలని అధికారులకు సూచించారు.సారస్ మేళా వంటి ప్రదర్శనలు గ్రామీణ మహిళలకు తమ ఉత్పత్తులను విస్తృత స్థాయిలో వినియోగదారులకు పరిచయం చేసుకునేందుకు, వ్యాపార సంబంధాలను పెంపొందించుకునేందుకు చక్కని వేదికగా నిలుస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా మహిళలు తమ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్‌ను సంపాదించుకోవడంతో పాటు, కుటుంబ ఆర్థిక పరిస్థితిని




మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. మహిళల విజయాలు మరింత మందికి స్ఫూర్తినిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడతాయని అన్నారు.సారస్ మేళాలో కామారెడ్డి జిల్లా మహిళలకు అవసరమైన సహకారం అందిస్తూ, వారి విజయాలకు తోడ్పడుతున్న సంబంధిత అధికారులు, సిబ్బందిని కూడా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అభినందించారు. మహిళా సంఘాల సభ్యులు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ మరిన్ని విజయాలు సాధించాలని, ఇతర మహిళలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.
మహిళల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, వారికి తగిన అవకాశాలు కల్పించడం ద్వారా మహిళా సాధికారతకు జిల్లా యంత్రాంగం ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా స్పష్టమైంది.

# 70 జాకీ ల సాయంతో 5 అడుగుల మేర పైకి లేపుతున్న సీతరామాంజనేయ స్వామి ఆలయం

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండలో 1976లో నిర్మించిన పురాతన ఆలయానికి కొత్త రూపు 70 జాకీల సాయంతో ఐదు అడుగుల మేర పైకి లేపుతున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయం. కొత్త ఆలయ నిర్మాణానికి బదులుగా పాత ఆలయాన్నే ఎత్తు పెంచుతున్న గ్రామస్తులు. కార్తీక మాసంలో ఆలయ పునఃప్రతిష్ఠకు సన్నాహాలు.



